క్లుప్తంగా

చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రవీణ్‌కుమార్

కోడుమూరు రూరల్: గర్భవతులు, చిన్నారుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వ్యాధుల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆయన గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో సమావేశమై గర్భవతులు, చిన్నారుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇవ్వాల్సిన టీకాలపై చర్చించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఇంద్రధనస్సు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చిన్నారులు, గర్భవతులకు నెలవారి వ్యాక్సిన్లు వేయాలని ఆదేశించారు. అలాగే సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు మందులను అందించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు శారద, ఉమాభాయి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సి.బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు చెందిన ఆరు నెలల రిపోర్టులు, నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు. అలాగే మండల పరిషత్ సభ్యులు హాజరై సమస్యలను పరిష్కరించేందుకు చేయూతనివ్వాలని కోరారు. సమావేశానికి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరయ్యే అవకాశం ఉందని, సభకు హాజరు కాని అధికారులపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

14న వేలం పాట

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మిమాధవస్వామి ఆలయంలో 2024 జనవరి 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు టెంకాయలు విక్రయించుకునే హక్కుల కోసం ఈ నెల 14న వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ గుర్రెడ్డి గురువారం తెలిపారు. ఆలయ ఆవరణలో నిర్వహించే టెంకాయల వేలం పాటలో పాల్గొనాలనుకునే వారు ముందుగా రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాలని, పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడు మొత్తం చెల్లించాల్సి ఉంటుందని ఈఓ పేర్కొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



సి.బెళగల్‌లో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

సి.బెళగల్: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మన్మధవిజయ్ అన్నారు. గురువారం ఆయన పోలీస్ సిబ్బందితో మండలంలోని గ్రామాలలో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మండల పరిధిలోని ఇనగండ్ల గ్రామంలో తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. గ్రామాలలో ఇసుకను అక్రమంగా తరలించే వారిపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



విద్యార్థులకు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు అందిస్తున్న దృశ్యం

కల్లూరు: పాఠశాలలో ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారి హేమలత సూచించారు. గురువారం ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న విఫ్స్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో విద్యార్థులకు రక్తహీనత గురించి అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉలిందకొండ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ నాగరాజు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి

- కేతవరంలో విజయవంతంగా 'గడప గడపకు మన ప్రభుత్వం'
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి జన నీరాజనం
- హారతులు పట్టి ఆదరణ చూపిన మహిళలు



కేతవరంలో లబ్ధిదారుడికి సంక్షేమ క్యాలెండర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ఓర్వకల్లు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు నిరుపేదలకు కొండంత అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. గురువారం మండలంలోని పూడిచెర్ల గ్రామ సచివాలయ పరిధిలోని కేతవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గోవర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అతిథులకు ప్రజలు నీరాజనం పట్టారు. మహిళలు హారతులు పట్టి, ఎమ్మెల్యే నొదుటన బొట్టు పెట్టి మరీ ఆశీర్వదించారు. అనంతరం గడప గడపకు తిరుగుతూ, అవ్వా బాగున్నావా? పెద్దయ్యా నెలనెలా పింఛన్ వస్తోందా? అమ్మా పిల్లలకు ప్రతి ఏడాది అమ్మఒడి అందేతుందా? అయ్యా రైతు భరోసా వస్తుందా? అమ్మా ఇంటి పట్టా వచ్చిందా? అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ అధికారులతో కలిసి గ్రామంలో కలియతిరిగారు. ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి వివరిస్తూనే, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ కాల్వలు, సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గడిచిన నాలుగున్నర ఏళ్లలో అర్హతగల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరిందని వివరించారు. టీడీపీ వారు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మిమోసపోవద్దని, ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని పిలుపునిచ్చారు. అర్హులకు ప్రభుత్వం అందజేసిన సంక్షేమ క్యాలెండర్లను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శ్రీరెడ్డి చెన్నారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, స్థానిక నాయకులు వెంకటేశ్వర్లు, కృష్ణ, కృష్ణారెడ్డి, జగన్‌రెడ్డి, చంద్రారెడ్డి, సిద్ధయ్య, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

కార్యక్రమం ముగిసిన అనంతరం గ్రామస్తుల విన్నపం మేరకు స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలను ఎమ్మెల్యే కాటసాని సందర్శించారు. పాఠశాలలో పనిచేస్తున్న హిందిదీ ఉపాధ్యాయుడు డెప్యుటేషన్‌పై లొద్దిపల్లెకు వెళ్లడంతో ఇక్కడి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరొకరిని నియమించాలని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే పిల్లల చదువుకు ఇబ్బంది కలగకుండా వారం రోజుల్లోగా మరొకరిని డెప్యుటేషన్‌పై నియమించాలని ఎంఈఓను ఆదేశించారు. విషయాన్ని జిల్లా విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంఈఓ ఓంకార్‌యాదవ్ తెలిపారు. తహసీల్దార్ శివప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



గుడిపాడులో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

గూడూరు రూరల్: ఉపాధి పనులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. ఆయన గురువారం గుడిపాడులో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు 100 రోజుల పని దినాలను పూర్తి చేస్తుకోవాలన్నారు. వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో గ్రామాల్లో వీలైనన్ని ఎక్కువ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు చూపేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని, కూలీలు సొంత గ్రామంలోనే పనులు చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు.

నేడు కార్తీక లక్ష దీపోత్సవం



లక్ష దీపోత్సవానికి ఏర్పాట్లు చేసిన దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వర స్వామి దేవస్థానం వద్ద శుక్రవారం కార్తీక లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ తెలిపారు. శివపార్వతులకు అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసంలో భక్తులు స్వాముల వారిని దర్శించుకొని దీపాలు వెలిగిస్తే సకల పాపాలు తొలగిపోతాయనేది భక్తుల విశ్వాసం. అందుకు ఈ మాసంలో ప్రతి సోమ, శుక్రవారాలలో మహిళలు తలస్నానాలు ఆచరించి ఉపవాసం ఉండి శివాలయాలకు వెళ్లి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకుంటారు. తమ పాపాలను తొలగించాలని పరమశివునికి అభిషేకార్చనలతో ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ నేపథ్యంలోనే గతేడాది నుంచి కాల్వబుగ్గలో లక్ష దీపోత్సవ పూజలకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే దంపతుల సహకారం

గత రెండేళ్లుగా కాల్వబుగ్గలో లక్ష దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సతీమణి ఉమామహేశ్వరమ్మ ఆర్థిక సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. దాదాపు 1000 జంటలు దీపోత్సవంలో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి సుమారు రూ.8 లక్షలు ఖర్చు చేయనున్నారు. సాయంత్రం 5 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో భక్తులకు ఇబ్బందులు, అవాంతరాలు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా గల విశాలమైన మైదానంలో లక్ష దీపోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు స్వాముల వారికి మహన్యాసపూర్వక ఏకదశ రుద్రాభిషేకాలు, 7 గంటలకు అమ్మవారికి కుంకుమార్చన, సహస్రనామావళి పూజలు నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ అధికారులు పిలుపునిచ్చారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ లక్ష్మిదేవి సూచించారు. గురువారం మండలంలోని వర్కూరు గ్రామ సచివాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, సీఎం జగన్ చేసిన మేలును ప్రజలకు వివరించడంతో పాటు, 33 సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగాను అందిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. సచివాలయం పరిధిలో అందించిన పథకాలు, ప్రగతిని వివరిస్తూ సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. సర్పంచ్ లక్ష్మిదేవి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల నగదును నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ మహిళాభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఈఓఆర్డీ మంజుల, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఇన్‌చార్జ్ లాయర్ ప్రభాకర్, స్థానిక నాయకులు మధుమోహన్ రెడ్డి, రాజశేఖరరెడ్డి, పాపిరెడ్డి, రమణారెడ్డి, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనకు పట్టం కట్టాలి

ఓర్వకల్లు: రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలు మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు శ్రీరెడ్డి చెన్నారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో 'ఏపీకి జగనే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ శకుంతలమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి చెన్నారెడ్డితో పాటు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాషా,ఎంపీటీసీ సభ్యురాలు భూషపోగు సరోజమ్మ, గ్రామ నాయకులు బొమ్మన రామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీ జెండాను ఎగురవేసి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో పర్యటించి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సచివాలయ కన్వీనర్లు బొమ్మన ప్రభావతమ్మ, మొల్ల ఇస్మాయిల్, బొట్టు గోకారి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అసత్య ప్రచారాన్ని తిప్పికొడదాం

కల్లూరు: రాష్ట్రంలో టీడీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొడదామని కల్లూరు అర్బన్ క్లస్టర్-1 అధ్యక్షుడు భీమా శంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారురు. గురువారం సాయంత్రం కల్లూరు అర్బన్ 28వ వార్డులో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే మళ్లీ ఎందుకు కావాలి' మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు సాయి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చెన్నారెడ్డి



మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్

కర్నూలు కల్చరల్: జగనన్న పాలనతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం నగర కార్పొరేషన్ పరిధిలోని 40వ వార్డు 103వ సచివాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వార్డు పరిధిలోని ప్రతి గడపకూ వెళ్లి నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని గృహ సారథులు, వార్డు నాయకులు వివరించాలన్నారు. జగనన్న పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి బాటలో పయనించాలంటే రాష్ట్రానికి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, సాంబశివరావు, నాయకులు జీఎస్ కరీం, మాసుంబిల్, తదితరులు పాల్గొన్నారు.



వర్కూరులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

మహిళల ఆర్థికాభివృద్ధికే 'ఉన్నతి'



మహిళా లబ్ధిదారులకు ఆటో కీ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు కల్చరల్: మహిళల ఉన్నతికి జగనన్న ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. ఏపీ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉన్నతి – ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా మంజూరైన ఆటోలను గురువారం స్టాంటన్‌పురం వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ కార్యాలయంలో లబ్ధిదారులైన మహిళలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ సబ్ ప్లాన్ నుంచి ఒక్కొక్క ఆటోకు రూ.2,70,884 చొప్పున వడ్డీలేని రుణంతో నాలుగు ఆటో రిక్షాలను కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించామన్నారు. ఇందుకు ప్రభుత్వమే వడ్డీ భారం భరిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సి.బెళగల్: ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. గురువారం మండల వైకేపీ ఏపీఎం వెంకటస్వామి ఆధ్వర్యంలో సెర్ప్ 'ఉన్నతి మహిళా శక్తి' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రానికి చెందిన పొదుపు మహిళ సుకన్యకు మంజూరైన సబ్సిడీ ఆటోను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అందజేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఎం మాట్లాడుతూ.. ఉన్నతి ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు వడ్డీ లేని రుణ సాయంతో ఆటోలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో 10 శాతం లబ్ధిదారుల వాటా కాగా రూ.3,03,434 విలువచేసే ఆటోను అందిస్తారన్నారు. ఆసక్తి ఉండి డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ఎస్సీ, ఎస్టీ పొదుపు మహిళలు వీఓఏలను, వైకేపీ అధికారులను సంప్రదించాలన్నారు. వైకేపీ సీసీలు గుండమయ్య, శ్రీనివాసులు, అకౌంటెంట్ గోవిందు, వీఓఏలు, పొదుపు మహిళలు ఉన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి



బిలకలగూడూరులో పంట నమోదు చేస్తున్న దృశ్యం

గడివేముల: మండలంలోని రైతులు రబీలో సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు కార్యక్రమం ప్రారంభించామని, రైతులు ఆర్బీకే సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని ఏఓ హేమసుందర్ రెడ్డి సూచించారు. ఆయన గురువారం బిలకలగూడూరు గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ పంట నమోదు చేయించుకోవడం ద్వారా రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. ప్రకృతి వైపరీత్యాల ద్వారా నష్టం జరిగితే పరిహారం అందుతుందని చెప్పారు. అలాగే రైతులు పండించిన పంట దిగుబడులను గిట్టుబాటు ధరకు అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ విజయశేఖర్, సీఐ మన్సూరుద్దీన్, ఎస్‌ఐ మన్మథవిజయ్

సి.బెళగల్: డివిజన్‌లో శాంతి భద్రల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ అన్నారు. ఆయన గురువారం వార్షిక తనిఖీలో భాగంగా సి.బెళగల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ పరిసరాలు, పోలీసుల నివాసాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మన్మథ్‌విజయ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది డీఎస్పీకి గౌరవ వందనం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ.. మండల పరిధిలోని గ్రామాలలో గతంలో అక్రమ మద్యం కేసులు అధికంగా ఉండేవని, అయి తే అక్రమ మద్యం రవాణా, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఉంచి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవ డం కారణంగా కేసులు గణనీయంగా తగ్గాయ న్నారు. ప్రజలకు, ఆయా సందర్భాలలో బాధితుల కు అండగా ఉండేందుకు ప్రభుత్వం పోలీస్ శాఖలో వివిధ సంస్కరణలను తీసుకొచ్చిందన్నారు. త్వరలో గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి శాంతి భద్రతలను పర్యవేక్షించాలని కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, ఎస్‌ఐలను ఆయన ఆదేశించారు. అ లాగే నిఘా పటిష్టం చేసి రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలను పసిగట్టి నేరాల నియంత్రణకు కృషి చే యాలన్నారు. ఏపీ పోలీస్ యాప్‌తో ప్రజలకు పో లీస్ సేవలు మరింత చేరువయ్యాయని తెలిపారు. ఏఎస్‌ఐ నాగయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గూడూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ

గూడూరు: కర్నూలు డీఎస్పీ కే.విజయశేఖర్ గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు, కేసుల వివరాలను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని, స్టేషన్‌కు వచ్చే బాధితులకు అండగా నిలవాలని పోలీసులకు సూచించారు. కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, స్థానిక ఎస్‌ఐ చిన్న పీరయ్య ఉన్నారు.

ఫార్మా డీలో అపార అవకాశాలు

పాణ్యం: కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందని శాంతిరాం కళాశాల చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతిరాముడు అన్నారు. గురువారం శాంతిరాం ఫార్మసీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ బీ ఫార్మసీ, ఫార్మా డీ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. క్లినికల్ ఫార్మసిస్టులుగా ఫార్మా డీ విద్యార్థులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఆరోగ్య రంగంలో ఫార్మా డీ విద్యార్థులకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. కళాశాల టీం డాక్టర్ డీవీ అశోక్ కుమార్, డాక్టర్ ఎం సిద్దయ్య, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ సీ.మధుసూదన సెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక విడుదల



రామిరెడ్డి తాత ఆరాధన మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలో వెలసిన అవధూత రామిరెడ్డి తాత 31వ ఆరాధన మహోత్సవాల ఆహ్వాన పత్రికను గురువారం తాత సేవా సంస్థాన్‌లో ఆవిష్కరించారు. జనవరి 16వ తేదీన ఆరాధనోత్సవాలు ప్రారంభం అవుతాయని నిర్వాహకులు తెలిపారు. అంతకుముందు రామిరెడ్డి తాతకు మేలుకొలుపు, పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆహ్వాన పత్రిక దాతలు జయప్రకాష్ దంపతులు, రాజశేఖర్, సంస్థాన్ అధ్యక్షులు దాసరి రామచంద్రారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో స్థలం కేటాయింపు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లో ఏపీ ఫైబర్ నెట్‌కు సంబంధించి భారత్ నెట్ ఫేజ్–2 పరికరాల ఇన్‌స్టాలేషన్ కోసం సర్వే నంబర్ 896/బీలో 1.5 సెంట్ల స్థలాన్ని కేటాయించినట్లు జేసీ నారపురెడ్డి మౌర్య ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఆమె కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. వెంటనే ఏపీ ఫైబర్ నెట్‌కు కేటాయించిన స్థలంలో కార్యకలాపాలను ప్రారంభించాలని సూచించారు. కల్లూరు తహసీల్దార్ రమేష్‌బాబు వెంట ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కల్లూరు మండలంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. కల్లూరు అర్బన్ 28వ వార్డు పందిపాడు గ్రామానికి చెందిన 100 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్వగృహంలో పందిపాడుకు చెందిన డీలర్ శేఖర్, లాయర్ రాజు, గుమ్మళ్ల శేఖర్‌తో పాటు 100 కుటుంబాల వారు పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి అందరూ కలసి పనిచేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. పందిపాడులో ఎలాంటి సమస్య వచ్చినా అందరికీ తోడుగా, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో సుధాకర్, దానియేలు, బాబు, వెంకటేష్, శేషు, శివుడు, వెంకటేశ్వర్లు, రాంబాబు, మురళి, సూరి, శంకర్ తదితరులు ఉన్నారు. వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సుపరిపాలనతో పాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నాయకత్వం నచ్చి పార్టీ చేరామన్నారు. కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు భీమేష్‌రెడ్డి, కార్పొరేటర్లు నారాయణరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ పీుదివేముల ప్రభాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

వీధి బాలల బడిబాట



ఆధార్ లేని పిల్లలను బడిలో చేర్పించి విద్యా కానుక కిట్లను అందించిన అధికారులు

పాణ్యం: బడి ఈడు పిల్లలందరూ బడిలో చదువుకోవాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల జీఈఆర్ సర్వేను చేయించారు. ఈ సర్వేలో నంద్యాల జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందులో భాగంగా పాణ్యంలోని చెంచు కాలనీలో ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు అధికారులు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ మేకల పల్లవి, తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం, ఎంపీడీఓ దస్తగిరి తదితరులు గురువారం చెంచులకు అర్థమయ్యేలా వారి వద్దకే వెళ్లి చదువుకోవడం వల్ల ఉపయోగాలను వివరించి పిల్లలను బడిలో చేర్పించేలా చైతన్యం కల్పిస్తున్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, ప్రధాన కూడళ్ల వద్ద ఆకర్షణీయమైన చిత్రాలతో 'బడికి పోదాం' ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అలాగే కాలనీలో తిరుగుతూ.. పిల్లలను బడికి పంపితే ప్రభుత్వం అందించే సౌకర్యాలను మైక్ ద్వారా వివరిస్తున్నారు. ఆధార్ కార్డు లేని 8 మంది పిల్లలను అధికారులు గుర్తించి బడిలో చేర్పించారు. అలాగే వారికి జగనన్న విద్యా కానుక కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం పిల్లల భవిష్యత్తు కోసం ప్రత్యేక కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యతోనే బడుగుల తలరాతలు మారుతాయన్నారు.